క్లుప్తంగా

పంచాయతీ నిధులు వెనక్కి ఇవ్వాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం అందించిన నిధులను వెంటనే తిరిగి ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుకోరాదని రాష్ట్ర యువ మోర్చా అధ్యక్షుడు కేతినేని సురేంద్ర మోహన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు అన్నారు. ఈ మేరకు నగరంలోని కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా చేపట్టారు. అనంతరం జ్యోతిరావు పూలే పార్కు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా పోలీసులకు, బీజేపీ నాయకులకు మధ్య తీవ్ర తోపులాట చోటు చేసుకుంది.కార్యక్రమంలో బీజేపీ నాయకులు పైడి వేణుగోపాలం, నీలాపు విజయానంద్ రెడ్డి, అట్టాడ రవిబాబ్జి, చల్లా వెంకటేశ్వరరావు, శవ్వాన ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రాగోలులో విద్యుత్ అంతరాయం రేపు

అరసవల్లి: ఆమదాలవలస రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రాగోలు గ్రామ పరిధిలో ఈ నెల 12న ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆపరేషన్స్ ఈఈ బయ్యన్నాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

కొనసాగుతున్న ఓటర్ల సర్వే


సుభద్రాపురంలో సర్వే చేస్తున్న బీఎల్ఓ

లావేరు: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం బీఎల్ఓలు ఓటర్ల సర్వే చేపట్టారు. ఇంటింటికి వెళ్లి 18 ఏళ్లు నిండిన వారికి కొత్తగా ఓటు హక్కు కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరించారు. జాబితాలో మార్పులు, చేర్పులు చేసేందుకు వివరాలు నమోదు చేసుకున్నారు.

నేటి నుంచి త్రినాథ మందిర ఉత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాదుర్లపేట కలెక్టర్ కార్యాలయం వద్ద త్రినాథస్వామి మందిరం స్వర్ణోత్సవ వేడుకలు శుక్రవారం నుంచి మూడురోజుల పాటు జరుగుతాయని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవ మూర్తుల ఊరేగింపులు, హోమాలు, అర్ధ ఏకాహం భజనలు, త్రినాథ కళానికేతన్ వారిచే 'కొదమ సింహాలు' నాటిక ప్రదర్శన, అన్నప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

17 నుంచి శ్రావణ మాస ఉత్సవాలు


బాలా త్రిపురసుందరీ దేవి

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలో గల బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో ఈ నెల 17 నుంచి శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభమవుతాయని పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ఐదు వేళల్లో కుంకుమ పూజలు జరుగుతాయని, మహిళలు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. అమ్మవారికి లక్ష గాజులతో అలంకరణ కూడా ఉంటుందని పేర్కొన్నారు.

ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు


సాయిబాబా

శ్రీకాకుళం కల్చరల్: జెడ్పీ ఎదురుగా ఉన్న ఏపీహెచ్‌బీ కాలనీలో షిరిడీ సాయి ఆధ్యాత్మిక ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. షిర్డీ నుంచితీసుకువచ్చిన వస్త్రాలతో బాబాను అలంకరించారు. ఆలయ అర్చకులు పెంట శ్రీనివాసశర్మ, కిరణ్‌శర్మల నేతృత్వంలో క్షీరాభిషేకాలు నిర్వహించారు.

జగనన్న కాలనీల్లో పూర్తిస్థాయి వసతులు

ఆమదాలవలస రూరల్: జగనన్న కాలనీల్లో పూర్తిస్థాయి వసతులు కల్పిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. మండలంలో జొన్నవలస, సంతకొత్తవలస, సైలాడ గ్రామాల్లో జగనన్న కాలనీలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులతో మాట్లాడారు. గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మండల సచివాలయాల కో ఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్ పాల్గొన్నారు.


ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటుతున్న దృశ్యం


రణస్థలం: పాతర్లపల్లిలో మట్టిని సేకరించి వందనం చేస్తున్న సాయికుమార్


లావేరు: చినమురపాకలో మొక్కలు నాటుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


గార: అమరవీరుల శిలాఫలకం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ రఘురాం, తదితరులు

నేల తల్లికి నమస్కారం.. వీరులకు వందనం

రణస్థలం:

దేశ స్వాతంత్రం కోసం అమరులైన త్యాగమూర్తులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలం మండలం జె.ఆర్.పురం కోనేరు వద్ద నాభూమి-నాదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన నేలతల్లికి నమస్కరించుకోవడం, స్వాతంత్ర వీరులకు వందనం సమర్పించడం ఎంతో పుణ్యమన్నారు. అనంతరం మట్టి ప్రతిజ్ఞ చేశారు. వసుదాకు వందనంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీవో ఎం.శ్రీనివాసనాయుడు, ఎంపీడీఓ ఆర్.వి.రమణమూర్తి, ఏవో ధనుంజయరావు, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, నాయకులు చిల్ల వెంకటరెడ్డి, పచ్చిగుళ్ల సాయిరాం, దన్నాన సీతారాం, పిన్నింటి సత్యంనాయుడు, టేకి బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

లావేరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నా భూమి..నా దేశం కార్యక్రమంలో భాగంగా గురువారం లావేరు మండలం చినమురపాక, చిన్నయ్యపేట, మురపాక, బుడుమూరు, పెదరావుపల్లి గ్రామాల్లో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ నేలతల్లిని రక్షించుకోవాలని, మొక్కలను సంరక్షించుకోవాలని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.సురేష్‌కుమార్, ఉపాధి ఏపీఓ ఆర్.సత్యవతి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ మీసాల సీతన్నాయుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, చిన్నయ్యపేట సర్పంచ్ కలిశెట్టి భాస్కరరావు, లింగాలవలస మాజీ సర్పంచ్ వాళ్లే దాలినాయుడు, వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు గొర్లె సూర్యప్రకాష్, వీఆర్ఓలు చిన్న, స్వామినాయుడు ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: జరజాం గ్రామంలో నా భూమి-నాదేశం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మొదలవలస చిరంజీవి శిలాఫలకాన్ని ఆవిష్కరించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మురళీధర్‌బాబా, ఎంపీటీసీ సీరపు శ్రీరామ్మూర్తి, నాయకులు బెండు రామారావు, బగ్గు రాజారావు, కొత్తకోట సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.


రణస్థలం: జె.ఆర్.పురంలో నాభూమి-నాదేశం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: పచ్చదనం- పరిశుభ్రత అందరి బాధ్యత అని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ అన్నారు. చంద్రయ్యపేటలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లా లక్ష్మి భవాని, ఈసీ గేదెల పురుషోత్తంనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు బొల్లా జనార్ధనరావు, పిట్టా భాస్కరరావు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: దేశాన్ని, నేలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి తెలిపారు. చిలకపాలెంలో నా భూమి నా దేశం కార్యక్రమంలో భాగంగా నేల తల్లికి నమస్కారం, అమరవీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మురళీధర్‌బాబా, నాయకులు డొంక రమణ, అప్పలరాజు ఏపీవో శోభాదేవి తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం: మండలంలోని వాండ్రంగి సచివాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన నా భూమి-నాదేశం శిలా ఫలకాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బూరాడ వెంకటరమణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాకేటి నాగరాజు, ఏపీఓ చోళ్ల సత్యనారాయణ, ఈసీ గేదెల పురుషోత్తంనాయుడు తదితరులు పాల్గొన్నారు.


జి.సిగడాం: వాండ్రంగిలో ప్రతిజ్ఞ చేస్తున్న బూరాడ వెంకటరమణ, నాయకులు

గార: అమరవీరులను స్మరించుకుందామని ఎంపీపీ గొండు రఘురాం అన్నారు. బూరవెల్లిలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా అమర వీరుల కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. నామట్టి- నా దేశంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సంజీవి రమణయ్య, మళ్ల నారాయణమూర్తి, సర్పంచ్ మార్పు పృథ్వీరాజ్, ఏపీవో సంధ్యారాణి పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని పాతర్లపల్లి, సీహెచ్‌రాజాం, పైడిభీమవరం, కె. మత్స్యలేశం, అర్జునవలస, మహంతిపాలెం గ్రామాల్లో నాభూమి-నాదేశంలో భాగంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ మట్టిని సేకరించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ టొంపల సీతారాం, సర్పంచ్ గొర్లె రాధాకృష్ణ, ఏపీవో ఎం.శ్రీనివాసనాయుడు, ఎంపీడీఓ ఆర్.వి.రమణమూర్తి, ఏవో ధనుంజయరావు, వైఎస్సార్ సీపీ మండల నాయకులు మహంతి పెదరామినాయుడు, చిల్ల వెంకటరెడ్డి, మహంతయ్య, సచివాలయ సిబ్బంది ఉన్నారు.


ఎచ్చెర్ల: మట్టిని సేకరిస్తున్న ఎంపీపీ చిరంజీవి తదితరులు


జి సిగడాం: చంద్రయ్యపేటలో మొక్కలు నాటుతున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) క్యాంపస్ జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో గురువారం నా భూమి-నాదేశం కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పైడి వెంకటలక్ష్మీనారాయణరావు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు ముకుందరావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వార్డు మెంబర్ల ఎన్నికకు నామినేషన్ల స్వీకరణ


గార: కొమరవానిపేటలో నామినేషన్ వేస్తున్న దృశ్యం


జి.సిగడాం: అధికారులతో మాట్లాడుతున్న నాయకులు

గార: మండలంలోని ఐదు పంచాయతీల్లో జరగనున్న వార్డు మెంబర్లు ఎన్నికకు సంబంధించి గురువారం సాయంత్రం 5 గంటలతో నామినేషన్ల స్వీకరణ ముగిసిందని ఎన్నికల అధికారి సంజీవ రమణయ్య తెలిపారు. కె.మత్స్యలేశం (పోర్టు కళింగపట్నం) నుంచి ఒక వార్డుకు రెండు నామినేషన్లు, బలరాంపురం పంచాయతీలో ఒక వార్డుకు రెండు నామినేషన్లు, అంబళ్లవలస ఒక వార్డుకు ఒక దరఖాస్తు, కొమరవానిపేట పంచాయతీలో ఒక వార్డుకు ఒక నామినేషన్, కె.సైరిగాం నుంచి ఒక వార్డుకు ఒక నామినేషన్ వచ్చినట్లు వివరించారు. శుక్రవారం పరిశీలన జరుగుతుందని, శనివారం అధికారి వద్ద అప్పీలు చేసే అవకాశం, 14న నామినేషన్లు ఉపసంహరణ ఉంటుందని తెలిపారు.

జి.సిగడాం: మండలంలోని దవళపేట మూడో వార్డు సభ్యుని ఎన్నిక కోసం వార్డు నుంచి కంచరాన శ్రీనివాసరావు ఒక్కరే నామినేషన్ వేశారని ఎన్నికల రిట్నరింగ్ అధికారి అరసాడ రవి గురువారం తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వాతి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూరాడ వెంకటరమణ, సచివాలయం కన్వీనర్ పేడాడ శ్రీరామమూర్తి, నాయకులు బొడ్డేపల్లి ఉదయ్‌కుమార్, కంచరాన రమణారావు, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ పేడాడ శ్యామలరావు పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బంది పనితీరుపై అసంతృప్తి

- సంతకాలు, వేలిముద్రలు లేకుండా వేతనాల చెల్లింపు..

పాతపట్నం: మండలంలోని అన్ని గ్రామం పంచాయతీల్లో ఉపాధి వేతనదారులకు సంతకాలు, వెలిముద్రలు లేకుండా వేతనాలను అందజేయడంపై ఉపాధి హామీ పథకం సాంకేతిక సహాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లపై డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని 34 గ్రామ పంచాయతీల్లో 2022-23 సంవత్సరానికి గాను ఉపాధి కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ ప్రజా వేదిక గురువారం నిర్వహించారు. ఫీల్డ్ అసిస్టెంట్ల నిర్లక్ష్యం వల్లే ఇలా చేస్తున్నారని అన్నారు. మండల అధికారుల లోపం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. జిల్లా విజిలెన్స్ అధికారి బి.లవరాజు, ఏపీడీ పి.రాధ, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో బీఎల్ఏల పాత్ర కీలకం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ ఇప్పటినుంచే పనిచేయాలని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని బూత్ స్థాయి ఏజెంట్లతో గురువారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో బీఎల్ఏల పాత్ర రానున్న ఎన్నికల్లో ప్రధానం కానుందన్నారు. నియోజకవర్గంలో 290 పోలింగ్ కేంద్రాలకు పార్టీ తరఫున బీఎల్ఏలను ఇప్పటికే నియమించామన్నారు. ఇది మొదటి సమావేశమని, తరచూ కలుసుకుని గ్రామాల్లో పరిస్థితిని సమీక్షించుకుందామన్నారు. గత ఎన్నికల్లో అందరూ ఎంతో కష్టపడి పనిచేశారని, జిల్లాలో అందరి కంటే ఎక్కువ మెజార్టీ మనకే వచ్చిందన్నారు. దీనికి మీ ఆదరణ, ప్రేమే కారణమని, అదే స్ఫూర్తితో రానున్న ఎన్నికల్లో కూడా పనిచేయాలన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ చూడాలని, ఆ లక్ష్యంతోనే అందరూ పని చేయాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ మేలు జరిగిందని, దీనిని ప్రజలకు వివరించి వారి మన్ననలు పొందాలన్నారు. పార్టీ ప్రధాన నాయకులు శాస్త్రి, కరిమి రాజేశ్వరరావు, ఆరంగి మురళి, లుకలాపు రవి, సాయిప్రసాద్, బైరాగినాయుడు, కణితి కృష్ణమూర్తి, వాన గోపి, నక్క తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గడపగడప విజయోత్సవ సభ


సమావేశంలో మాట్లాడుతున్న పిన్నింటి సాయికుమార్

రణస్థలం: గడపగడపకు-మన ప్రభుత్వం కార్యక్రమం ఎచ్చెర్ల నియోజకవర్గంలో 100 గ్రామ సచివాలయాల్లో విజయవంతంగా ముగిసిందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. రణస్థలంలోని ఎంపీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ నేతృత్వంలో జె.ఆర్.పురం సూర్య స్కూల్ పక్కన గల బహిరంగ ప్రదేశంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల ప్రముఖుల ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ సభకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, మహిళా అధ్యక్షులు, జేసీఎస్ ఇన్‌చార్జిలు, పీఏసీఎస్ చైర్మన్లు, కార్పొరేషన్ డైరెక్టర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాయల కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, మండల జేసీ.ఎస్ ఇన్‌చార్జి చిల్ల వెంకటరెడ్డి, మండల నాయకులు మహంతి పెదరామినాయుడు, మాజీ సర్పంచులు దంగుడుబియ్యపు శ్రీను, పుచ్చల దాము, నాయకులు రెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

విజయోత్సవ సభకు తరలిరండి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ముగింపు సందర్భంగా నిర్వహిస్తున్న విజయో త్సవ సభకు పార్టీ నాయకులు, క్యాడర్ తరలిరావాలని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి పిలుపునిచ్చారు. ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రణస్థలంలో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు సభ ప్రారంభమవుతుందని చెప్పారు. 28 గ్రామ సచివాలయాల నుంచి భాగస్వామ్యం ఉండాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలనే లక్ష్యం


రణస్థలం: జె.ఆర్.పురంలో విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు వేస్తున్న సాయికుమార్


జి.సిగడాం: జెడ్పీ పాఠశాలలో మాత్రలు వేస్తున్న జిల్లా అదనపు వైద్యాధికారి అనూరాధ


ఎచ్చెర్ల: దుప్పలవలస గురుకులంలో విద్యార్థులతో మాత్రలను మింగిస్తున్న సిబ్బంది


లావేరు: కేశవరాయునిపాలెం పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు అందిస్తున్న దృశ్యం

పిల్లల ఎదుగుదలను అడ్డుకునే నులిపురుగులను నిర్మూలించడమే లక్ష్యంగా ఎచ్చెర్ల, శ్రీకాకుళం నియోజకవర్గాల్లో గురువారం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో 19 ఏళ్లలోపు వారితో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, అంగన్‌వాడీ సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్

నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే చర్యలు

సారవకోట: రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. తెంబూరు, హిరమండలం రోడ్డు నిర్మాణ పనులను మండలంలోని పెద్దలంబ సమీపంలో జరుగుతున్న పనులను గురువారం పరిశీలించారు. పాతపట్నం మండలం తెంబూరు నుంచి సారవకోట మండలంలోని పెద్దలంబ, బొంతు జంక్షన్ మీదుగా హిరమండలం వెళ్లేందుకు రోడ్డు విస్తర్ణ, నిర్మాణ పనులను రూ.25 కోట్లతో జరుగుతున్నాయన్నారు. 15 కిలో మీటర్ల పొడవున ఈ రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఈఈ పి.సత్యనారాయణ, డీఈఈ తిరుపతిరావు, ఏఈ యోగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం


కొత్తూరు: మెట్టూరు జెడ్పీహెచ్ఎస్‌లో నినాదాలు చేస్తున్న యూటీఎఫ్ నేతలు

పోలాకి: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 50వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పోలాకి మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సంఘం పతాకాన్ని సీనియర్ నాయకులు ఆర్.శ్రీనివాసరావు విష్కరించారు. అధ్యయనం, అధ్యాపకం, సామాజిక స్పృహ అనే లక్ష్యాలతో ఏర్పడిన యూటీఎఫ్.. ఆ దిశగా అలుపెరగని పోరాటాలు చేస్తోందని పలువురు వక్తలు అన్నారు.

కొత్తూరు: యూటీఎఫ్ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మెట్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ పతాకాన్ని సీనియర్ నాయకులు ఆర్.కొండలరావు ఆవిష్కరించారు. యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశరావు, కొత్తూరు మండల శాఖ అధ్యక్షుడు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సంపూర్ణ శతావధానం


ముస్తాబైన బాపూజీ కళామందిర్

శ్రీకాకుళం కల్చరల్: సుమిత్రా కళాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మూడురోజుల పాటు జరిగే సంపూర్ణ శతావధానం కోసం నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏలూరుకు చెందిన అష్టావధాని వద్దిపర్తి పద్మాకర్ 24 మంది పృచ్ఛకులకు రెండురోజులు సమాధానాలు ఇస్తూ మూడో రోజున శతావధాన పద్యధారణ నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. ముగింపు సభకు శాసన సభాపతి తమ్మినేని సీతారాం, మంత్రి ధర్మాన ప్రసాదరావు హాజరవుతారని పేర్కొన్నారు.

స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనండి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా బార్ అసోసియేషన్ ఆవరణలో ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య వేడుకల్లో ప్రతిఒక్కరూ పాల్గొనాలని సంఘ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని తెలిపారు.